
సాక్షి బాపట్ల

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దిగువకు 2013 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ 43.0610 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు ఎగువ నుంచి 2200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటిస్తేనే ప్రభలకు అనుమతి



నరసరావుపేట: ప్రభల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తేనే అనుమతి మంజూరు చేస్తామని డీఎస్పీ సి.విజయభాస్కరరావు పేర్కొన్నారు. ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ వద్ద నిర్వహించే మహా తిరునాళ్లకు ప్రభలు నిర్వహించే వారితో తన కార్యాలయంలో డీఎస్పీ సోమవారం రాత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ప్రభలు కొండకు తీసుకొస్తారన్నారు. తీసుకొచ్చే సమయంలో పాటించే నిబంధనలు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రభల కమిటీ సభ్యులకు సూచించామన్నారు. వారందరూ వాటిని పాటిస్తామని ఆర్డీఓ, తహసీల్దార్లకు రూ.లక్ష బైండోవర్ చేస్తేనే ఆ ప్రభ కొండకు వచ్చేందుకు అనుమతి ఇస్తామన్నారు. ప్రభలపై పార్టీల జెండాలు పెట్టకూడదన్నారు. అశ్లీల నృత్యాలు ప్రదర్శించకూడదని చెప్పామన్నారు. రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఒన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్, టుటౌన్ సీఐ అమరేంద్ర, చిలకలూరిపేట సీఐ వై.అచ్చయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రేపు స్కిల్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డ్రైవ్


నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీసాయి తిరుమల ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన కళాశాలలో ఇండస్ట్రీ కస్టమైజ్ స్కిల్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ బాజీబాబు సోమవారం తెలిపారు. డ్రైవ్‌కు డిప్లమో, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలలో 2020–22 విద్యాసంవత్సరాల మధ్య ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. డ్రైవ్‌లో డైకిన్ సంస్థ ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బయోడేటాతో హాజరు కావాలని తెలిపారు. ఉదయం 9.30గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఎం.వీరాంజనేయులు (9160200652), షేక్ జానీబాషాలను (9951214919) నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కలెక్టరేట్ రోడ్ల నాణ్యత పరిశీలన



నరసరావుపేట: నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాల ప్రాంగణంలో సుమారు రూ.66లక్షల వ్యయంతో నిర్మించిన బీటీరోడ్డు నాణ్యతను పంచాయతీరాజ్ అధికారులు సోమవారం పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ ఏఈ గోపాలరావు నేతృత్వంలో సిబ్బంది అక్కడక్కడా రోడ్డును తవ్వి ఎంతమందంలో వేశారు.. ఏ మేరకు నాణ్యంగా వేశారనే దానిపై పలు నమూనాలను సేకరించారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 558.00 అడుగుల వద్ద ఉంది. ఇది 227.7480 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 8,298, ఎడమకాలువకు 8,986 ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 19,804 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 19,804 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 834.50 అడుగుల వద్ద ఉంది. ఇది 54.4492 టీఎంసీలకు సమానం.

ఇక బాల్య వివాహాలకు చెక్

అధికారులతో జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: బాల్య వివాహాలను సమూలంగా అరికట్టడానికి అధికారులు సమన్వయంతో కృషిచేయాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. బాల్య దశలోనే వివాహాలు చేసుకుని గర్భిణులైన వారితో సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బాలికల జీవితాలను నాశనం చేసే బాల్య వివాహాలను నిర్మూలించాలని కలెక్టర్ చెప్పారు. బాలికల హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత మహిళాశిశు సంక్షేమశాఖ అధికారులదేనన్నారు. సమాజానికి మేలుచేయడం మానేస్తే బాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కౌమార దశలోని కిశోర బాలికలు గర్భిణులుగా మారడంతో రక్తహీనత, పోషణ లోపానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బాపట్ల జిల్లాలో బాల్యదశలోనే గర్భిణులుగా నమోదైన 30 సచివాలయాల పరిధిలోని అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయకపోతే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరిగితే తక్షణమే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. 43 కేజీల బరువున్న 13 ఏళ్ల బాలిక గర్భిణిగా ఉండడం, 16 ఏళ్ల వయస్సున్న మరో బాలిక గర్భం దాల్చడంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. బాపట్ల నూతన జిల్లాగా ఆవిర్భవించిన ఏప్రిల్ 4వ తేదీ నుంచి జిల్లాలో జరిగిన వివాహాలపై సర్వే చేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పనితీరు బాగోలేదని ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కాగితాలపై లెక్కలు చూపడం మాని క్షేత్రస్థాయిలో వాస్తవికతను నమోదు చేయాలని ఆమె పలు సూచనలు చేశారు. సమాజంలో మార్పువచ్చేలా వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ప్రజలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమ, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ, సీపీఓ జి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన కేంద్రం.. బుద్ధ వనం

- అంతర్జాతీయ సౌకర్యాలతో ధ్యానబుద్ధ వనం
- రాష్ట్రంలోని ఐదు బౌద్ధ క్షేత్రాలను కలుపుతూ బుద్ధిస్ట్ సర్క్యూట్
- స్వదేశ దర్శనం కార్యక్రమంలో రూ.15కోట్ల నిధులు మంజూరు



ప్రారంభానికి ముస్తాబైన ధ్యాన బుద్ధవనం

అమరావతి: బౌద్ధ మతస్తులందరికీ పుణ్యస్థలంగా అమరావతి ప్రసిద్ధిగాంచింది. క్రీ.పూ. రెండో శతాబ్దంలో శాతవాహన చక్రవర్తులు అమరావతిని రాజధానిగా చేసుకుని పరిపాలించారు. క్రీ.పూ.3వ శతాబ్దంలో మౌర్య వంశస్తుడైన అశోక చక్రవర్తి కాలంలో బౌద్ధ భిక్షువులు ధర్మ ప్రచారం కోసం అమరావతికి రావడంతో ఆనాటినుంచి బౌద్ధ మతం అమరావతి, ధాన్యకటకంలలో పరిఢవిల్లింది. ఆ చరిత్రకు ఆనవాళ్లుగా అమరావతిలో రెండు పురావస్తు ప్రదర్శన శాలలు ఉన్నాయి. 2006 జనవరిలో బౌద్ధగురువు దలైలామా ఆధ్వర్యంలో కాలచక్ర నిర్వహణ అమరావతిలో జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 120అడుగుల ధ్యానబుద్ధ విగ్రహాన్ని ఇక్కడ నిర్మించారు. అలాగే ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న అమరారామ క్షేత్రంలో అమరేశ్వరుడు కొలువై ఉండటం ఇలా ఎన్నో ప్రత్యేకతలు అమరావతికి ఉన్నాయి. ప్రస్తుతం బౌద్ధమత విశిష్టతను మరింతగా ఇనుమడింపచేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో నిర్మితమైన ధ్యాన బుద్ధవనం తలమానికంగా నిలవనుంది. రాష్ట్రంలోని ఐదు బౌద్ధ క్షేత్రాలను కలుపుతూ కేంద్ర ప్రభుత్వం 2017లో బుద్ధిస్ట్ సర్క్యూట్ ఏర్పాటు చేయటం జరిగింది. ఇందులో రాష్ట్రంలోని ఐదు బౌద్ధ క్షేత్రాలైన శ్రీకాకుళం జిల్లా శాలిహుండం, అనకాపల్లి వద్ద తొట్లకొండ, బొజ్జనకొండ, పల్నాడు జిల్లాలోని అమరావతి, అలాగే నాగార్జున సాగర్ వద్ద ఉన్న అనుపులను ఇందులో చేర్చటం జరిగింది. ఈ ఐదు ప్రాంతాలను అభివృద్ధి చేయటానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ అనువైన స్థలాలను సమకూర్చగా కేంద్ర ప్రభుత్వం నూరుశాతం నిధులు మంజూరు చేసి యాత్రికులకు ఎన్నో అధునాతన వసతులతో నిర్మాణాలు చేయటం జరిగింది.



ధ్యాన కేంద్రం

అమరావతిలో ధ్యాన బుద్ధవన నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో రూ.15.02కోట్లతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని వసతులతో గత ఆరేళ్లలో నిర్మాణాలను పూర్తి చేయటం జరిగింది. ఈ ధ్యానబుద్ధ వనంలో సమాచార కేంద్రం, బహి రంగ ధ్యాన మందిరం, ఇన్నర్ మెడిటేషన్ హాల్, ఆడిటోరియం, ఫుడ్‌కోర్టు, గ్రంథాలయం ఉన్నాయి. అలాగే వచ్చే పర్యాటకుల వసతులకోసం ప్రత్యేకంగా పర్యాటకుల వసతి కేంద్రం ఏర్పాటుచేసి అందులో సమాచారకేంద్రం, ఇంటర్ ప్రిడిక్షన్ సెంటర్, ప్రథమ చికిత్సకేంద్రం, మరుగుదొడ్ల వసతి కల్పించారు. దివ్యాంగులకు కూడా అన్ని వసతులు కల్పించారు. ఈ ధ్యాన బుద్ధవనంను మంగళవారం కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.3,500, గరిష్ఠ ధర రూ.5,500, మోడల్ ధర రూ.4,500 వరకు పలికింది.

పరీక్ష పేపర్ల ట్యాంపరింగ్ కేసులో నిందితుడు అరెస్టు

- 29 మంది చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు నోటీసులు
- మరో 8 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన పెదకాకాని సీఐ బి.సురేష్‌బాబు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్‌బాబు, (ముసుగు ధరించిన ఉన్న నిందితుడు గంటా సురేంద్రనాథ్)

పెదకాకాని: విద్యార్థులు దురాశతో వక్రమార్గంలో మార్కుల కోసం ప్రయత్నించి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన పరీక్ష పేపర్ల మార్కుల ట్యాంపరింగ్ కేసులో 29 మంది విద్యార్థులకు 41 నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో సోమవారం ప్రధాన నిందితుడు గంటా సురేంద్రనాథ్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బండారు సురేష్‌బాబు మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ 37 మంది విద్యార్థులకు సంబంధించిన 55 సప్లిమెంటరీ(బ్యాక్‌లాగ్) పరీక్షా పేపర్లలో మార్కుల ట్యాంపరింగ్ జరిగినట్లు జనవరి 13వ తేదీన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ప్రొఫెసర్ ఫిర్యాదు ఆధారంగా ఏఎన్‌యూ ఇంజినీరింగ్ విభాగంలో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్న పెదకాకాని గ్రామానికి చెందిన గంటా సురేంద్రనాథ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో నిందితుడు మూల్యాంకనంలో మార్కుల ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు అంగీకరించాడు. చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 37 మంది విద్యార్థుల వద్ద నుంచి రూ. 55 లక్షలు వసూలు చేశానని, ప్రస్తుతం తనవద్ద రూ.50 వేలు మాత్రమే ఉన్నాయని అంగీకరించడం జరిగిందన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా 29 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారించగా ఇంజినీరింగ్ చివరి సంవత్సరం సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణత కోసం సురేంద్రనాథ్‌కు నగదు ఇచ్చినట్లు అంగీకరించారన్నారు. వారిలో మరో 8 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు. నిందితుని వద్ద నుంచి రూ. 50 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో ఇంకా ఎవరి హస్తం ఉందో విచారించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్‌ఐలు వి.రాంబాబు, పాదర్తి కోటేశ్వరరావు, ఏఎస్‌ఐ బాల కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడు చిక్కిందిలా....!

ఏఎన్‌యూలో మార్కుల ట్యాంపరింగ్ కేసులో ప్రధాన నిందితుడు గంటా సురేంద్రనాథ్ మూడేళ్ల క్రితం అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఏఎన్‌యూ ఇంజినీరింగ్ విభాగంలో విధుల్లో చేరాడు. పేపర్ వాల్యుయేషన్ జరిగే గది తాళాలు సురేంద్రనాథ్ వద్దే ఉన్నాయి. ఈక్రమంలో చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష రాయడంతో వారిని కలసి ఫోన్ నెంబర్లు తీసుకున్నాడు. వాల్యుయేషన్ రూము తాళాలు తీసిన నిందితుడు 37 మంది విద్యార్థులలో ముగ్గుర్ని టీం లీడర్లుగా పెట్టుకున్నాడు. వాల్యువేషన్ పత్రాలను ఫోన్‌లో ఫొటోలు తీసి ఆ ముగ్గురికీ పంపించడం, వారు మిగిలిన 34 మందికి పంపించి రైటింగ్ ఆధారంగా వారి పేపర్లను ధ్రువీకరించుకున్నారు. పాస్‌మార్కులు వేసేందుకు వారి ఫోన్‌ల నుంచి ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నిందితుడి అకౌంట్‌కు నగదు డ్రా చేయించుకున్నాడు. ముఖ్యంగా ఓఎంఆర్ షీట్‌లో మార్కులు దిద్దిన (ట్యాంపరింగ్) నిందితుడు దాని వెనుక ఉన్న జంబ్లింగ్ పేపర్‌లో సరిచేయడం మరిచాడు. దీంతో ఆ మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో ఎర్రర్ చూపించడంతో ట్యాంపరింగ్ జరిగినట్లు నిర్ధారణ జరిగింది.

పదవ తరగతి విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ పాలకవర్గం నడుం బిగించింది. జెడ్పీ నిధులు రూ.50 లక్షలు వెచ్చించి, సాయం సమయంలో అల్పాహారం అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నిధులతో ఉమ్మడి జిల్లాలోని 25వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. దీంతో విద్యార్థులు చదువుపై మరింత దృష్టిపెట్టి, ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం లభించనుంది.

ఆకలి తీరేను.. చదువులు సాగేను

- రేపటి నుంచి టెన్త్ విద్యార్థులకు అల్పాహారం
- ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని 25వేల మంది విద్యార్థులకు లబ్ధి
- జెడ్పీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయింపు



పదవ తరగతి విద్యార్థులు

గుంటూరుఎడ్యుకేషన్: ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న టెన్త్ విద్యార్థుల కడుపు నింపేందుకు జిల్లా పరిషత్ పాలకవర్గం నిధులు మంజూరు చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 25వేల మంది విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు జెడ్పీ నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించారు. ఈనెల 15వ తేదీ నుంచి అల్పాహారం పంపిణీ ప్రారంభం కానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు జెడ్పీ నిధులతో అల్పాహారం అందించాలని గతంలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంతో పాటు స్థాయీ సంఘ సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు చేసిన విజ్ఞప్తులతో స్పందించిన చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నిధుల విడుదలకు కృషి చేశారు.

డీఈఓల ద్వారా హెచ్‌ఎంలకు అందజేత

జెడ్పీ నుంచి కేటాయించిన నిధులతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని జెడ్పీఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 25వేల మంది టెన్త్ విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు కేటాయించిన రూ.50 లక్షల నిధులను ఆయా జిల్లాల వారీగా డీఈఓలకు అందజేయనున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు జమ చేయించి, ప్రతి రోజూ అల్పాహారాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టారు.

సీఎం వైఎస్ జగన్ ఆశయ స్ఫూర్తితో...



విద్యార్థులకు నాణ్యమైన ఆధునిక విద్య అందించేందుకు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో టెన్త్ విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేశాం. జెడ్పీకి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తు కోసం కేటాయింపులు జరుపుతున్నాం.

– కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ..

పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యధిక మార్కులను సాధించాలనే ఆశయంతో సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన ''జగనన్న విద్యా జ్యోతి'' స్టడీమెటీరియల్‌ను రూ.61.80 లక్షల జెడ్పీ నిధులతో ముద్రించి, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 36,155 మంది విద్యార్థులకు గతేడాది నవంబర్ 26 నుంచి పంపిణీ చేయించారు. రాష్ట్రంలోనే ప్రథమంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి అభినందనలు అందుకున్నారు.

లోక్ అదాలత్‌లో 4143 కేసులు పరిష్కారం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 11న జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 4143 కేసులను పరిష్కరించారన్నారు. జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో జిల్లా పోలీస్ అధికారులు విచారణ దశలో ఉన్న కేసులు మరియు కోర్టులో ట్రయిల్ పెండింగ్ ఉన్న కేసులలో కక్షిదారులు మధ్య రాజీ కుదిర్చి, కొన్ని కేసులలో ముద్దాయిలకు అపరాధ రుసుము విధింప జేసీ 838 క్రిమినల్ కేసులు, 3304 పెట్టీ కేసులు మొత్తం కలిపి 4143 కేసులను పరిష్కారం చేశారన్నారు. జిల్లా పోలీస్ అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందు నుంచి లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీచేసి, ఇరుపక్షల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి జాతీయ మెగా లోక్ అదాలత్‌లో వారి కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు, కుటుంబ కలహాలు, భార్యభర్తల గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ కేసులు, ఇతర కేసులలోని ఇరుపక్షాల కక్షిదారులు వారి వారి కేసులను కోర్టులలో పరిష్కరించుకోవడానికి ఎక్కువ కాలపరిమితి పడుతుంటుందని, అటువంటి కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే బాధితులకు సకాలంలో సత్వర న్యాయం చేకూరుతుందన్నారు.

జోరుగా మిర్చి క్రయవిక్రయాలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,44,700 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ–నామ్ ద్వారా 1,23,744 బస్తాల విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 91,441 బస్తాలు నిల్వ ఉన్నాయి. ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. దీంతో రైతులు విక్రయాలకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి రైతులు మిర్చిని యార్డుకు తరలిస్తున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరబెట్టి యార్డుకు తీసుకువస్తే ఆశించిన ధర వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించినట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వినయ్‌కుమార్



నిజాంపట్నం: యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా జె.వినయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా సిహెచ్.బాపయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అద్దంకిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. వినయ్‌కుమార్ నిజాంపట్నం మండలం శారదీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. బెల్లంకొండ వారిపాలెం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న సిహెచ్.బాపయ్య రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికైన వీరికి సంఘం మండల శాఖ అధ్యక్షుడు డి.హరిబాబు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.గణేష్‌రావు, ఉపాధ్యక్షులు అబుల్‌మాలిక్, లావణ్య, రాజేష్, వై.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

కొండకు వచ్చే వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి



మాట్లాడుతున్న నరసరావుపేట జిల్లా అధికారి పరంధామరెడ్డి

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండ తిరునాళ్లలో ప్రయాణికులను చేరవేసే వాహనాలు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలని రవాణా శాఖ నరసరావుపేట జిల్లా అధికారి టీకే పరంధామరెడ్డి తెలిపారు. కోటప్పకొండ రోడ్డులోని జిల్లా రవాణా శాఖాధికారి కార్యాలయంలో సోమవారం వాహన డ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. రవాణాశాఖ జిల్లా అధికారి పరంధామిరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని తెలిపారు. వాహనం ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్, ట్యాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ ఫోర్స్‌లో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను చేరవేయడం ప్రమాదకరమని తెలిపారు. లక్షలాదిగా భక్తులు వచ్చే తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణప్రసాద్, ఎన్.శివనాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించడానికి మూడు అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గ స్థాయిలో ఎన్నికలు నిర్వహించడానికి 13, గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 1400 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల్లో అదనంగా మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. చీరాల మండలంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించడానికి మరో రెండు పోలింగ్ కేంద్రాలను వేటపాలెం మండలంలో మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, ఎన్నికల సుపరింటెండెంట్ సుశీల, టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ ప్రతినిధులు బి.హనుమంతరావు, జాలాది భాగ్యశ్రీధర్, జి.గంగయ్య, జి.వి.ఎల్.మోహన్‌గౌడ్, కాగిత కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- 17 మండలాల నుంచి 85 ప్రాజెక్టులతో రానున్న విద్యార్థులు



భారతీయ శాస్త్రవేత్తల చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అరండల్‌పేట 15వ లైనులోని సెయింట్ ఇగ్నేషియస్ బాలికోన్నత పాఠశాలలో మంగళ, బుధవారాల్లో జరగనున్న జిల్లాస్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శన-2023కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజుల పాటు జరగనున్న ప్రదర్శనకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ పి.శైలజ స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని 17 మండలాల నుంచి ఎంపిక చేసిన 85 ప్రాజెక్టులతో విద్యార్థులు రానున్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్న ప్రారంభ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య అందించిన వివరాలు.. స్థానిక రైల్వే స్టేషన్‌కు సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పట్టాలపై పడిఉన్నాడనే సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. మృతుడి వయస్సు దాదాపు 55 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుడి జేబులో కారంచేడు- చీరాల వరకు బస్సు టికెట్ ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడు తెల్లషర్టు, తెల్ల పంచ ధరించి ఉన్నాడని, మెడలో ఎరుపు, తెలుపు దారం ఉందని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సమాచారం కోసం 94406 27646 సంప్రదించాలని కోరారు.

సొసైటీ నిధుల గోల్‌మాల్ కేసులో మరో నలుగురిపై కేసు

ఇద్దరి అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు

వేటపాలెం: నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో నలుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వేటపాలెం కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ.24 కోట్ల అవకతవకల కేసులో మరో నలుగురు డైరెక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జీ సురేష్ సోమవారం తెలిపారు. సొసైటీలో 2008 నుంచి 2013 వరకు చుండూరి శ్రీ ప్రకాష్, చుండూరి వెంకట రమణారావు, జివ్వాజి లక్ష్మీనారాయణ, ఊటుకూరి సూర్యనారాయణ డైరెక్టర్లుగా పనిచేశారు. వీరు పనిచేసిన సమయంలో సొసైటీలో రూ.48.50 లక్షలు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు విచారణ అధికారి గుర్తించారు. ఈ మేరకు ఆ నలుగురిపై కేసులు నమోదు చేశారు. 2021 జూలైలో నిధులు గోల్‌మాల్ విషయం బయటపడిన సమయంలో సొసైటీలో చైర్మన్‌గా వ్యవహరించిన వలివేటి నాగేశ్వరరావు, సెక్రటరీ(మేనేజర్) శ్రీరాం శ్రీనివాసరావుతో సహా పదిమంది డైరెక్టర్లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అనంతరం మూడు నెలల తరువాత కోర్టులో కండిషన్ బెయిల్ పొంది పదిమంది తిరిగి బయటికి వచ్చారు. ప్రస్తుతం కేసులు నమోదు చేసిన నలుగురిలో జివ్వాజి లక్ష్మీనారాయణ, ఊటుకూరి సూర్యనారాయణలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా ఇద్దరికి రిమాండ్ విధించారు. మరో ఇద్దరు డైరెక్టర్స్ చుండూరి శ్రీ ప్రకాష్, చుండూరి వెంకట రమణారావు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఎన్‌యూ క్రికెట్ టోర్నీ విజేత ఆర్‌వీఆర్‌జేసీ



విజయం సాధించిన జట్టుతో అంకమ్మ చౌదరి, గౌరీశంకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు

బాపట్ల అర్బన్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రికెట్ టోర్నీ విజేతగా గుంటూరు ఆర్ వీఆర్‌జేసీ జట్టు నిలిచింది. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ, గుంటూరు ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీ(చౌడవరం) తలపడ్డాయి. ఫైనల్‌లో 33 పరుగుల తేడాతో ఆర్ వీఆర్‌జేసీ విజయం సాధించింది. సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో ఏఎన్‌యూ చిప్స్‌పై సత్తెనపల్లి ప్రగతి డిగ్రీ కాలేజ్ విజయం సాధించి మూడో స్థానంలో, ఏఎన్‌యూ చిప్స్ నాలుగో స్థానం సాధించింది. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మనం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ దొప్పలపూడి రామ్మోహన్, ప్రిన్సిపాల్ ఎస్.కె.నజీర్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అంకమ్మ చౌదరి, పి.గౌరీ శంకర్, సెలక్షన్ కమిటీ మెంబర్స్, పాతూరు శ్రీనివాసరావు, పీఎస్ కాలేజీ పెదనందిపాడు జె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. ఏఎన్‌యూలో యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్థిక పొదుపు ఆపదలో ఆదుకుంటుంది..



భారత రిజర్వ్ బ్యాంకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

గుంటూరువెస్ట్: సంపాదించిన దానిలో కొంత మొత్తమైనా పొదుపు చేసుకుంటే అది ఆపదలో ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో భారత రిజర్వ్ బ్యాంకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ రామిరెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఈదర రాంబాబు, జిల్లా అధికారులు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 వరకు వారోత్సవాలు ప్రత్యే శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. సమస్యలున్నాయి కదా అని అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని ఇబ్బందులు పడవద్దన్నారు. ముఖ్యంగా ఎంత అవసరమో అంతే అప్పు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్స్‌లో రుణాలకు, డిపాజిట్లకు వచ్చే మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దన్నారు.

16న మెగా జాబ్‌మేళా

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంస్థలు సంయుక్తంగా ఈ నెల 16న మెగా జాబ్‌మేళాను తాడికొండ నియోజకవర్గ పరిధిలోని మేడికొండూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

అర్హులకే లంక భూములు లీజుకిస్తాం

అర్హులైన వారికి లంక భూములను ఐదేళ్ల పాటు సాగు చేసుకునేందుకు లీజుకిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో సాగు చేసుకుంటున్న వారికి జీఓ నెంబర్ 799 ప్రకారమే వ్యవహరిస్తామన్నారు. ఈ క్రమంలో కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో 182.56 ఎకరాలను 228 మంది రైతులకు, అన్నవరం గ్రామ పరిధిలోని 65.32 ఎకరాలను 182 మందికి సాగు చేసుకుంటున్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామాల్లో 247.88 ఎకరాల్లో సాగు చేసుకుంటున్న 32 మంది ఎస్టీలు, 328 ఎస్సీలు, బీసీలు ఆరుగురు, ఓసీలు 44 మొత్తం 410 మందికి లీజు పట్టాలిచ్చే ప్రతిపాదనను ఆమోదిస్తున్నామని చెప్పారు. లంక భూముల సాగులో ఇబ్బందులను కూడా గుర్తించి ఎప్పటికప్పుడు సాయమందించాలన్నారు.

స్టాఫ్‌నర్సులకు నియామక ఉత్తర్వులు

గుంటూరుమెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారికి సోమవారం సర్టిఫికెట్లు పరిశీలించి కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 282 స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు గాను గతంలో కొంత మంది నియామకపు ఉత్తర్వులు తీసుకున్నారు. మిగిలిన 52 పోస్టులకు సోమవారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం (ఆర్ఓఆర్) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో మెరిట్ ఆధారంగా ఉద్యోగంలో చేరేందుకు విల్లింగ్ ఇచ్చిన వారికి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పట్టపు పాల్, కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

భర్తను చంపిన భార్య

వినుకొండ(నూజెండ్ల): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య భర్తను హతమార్చిన సంఘటన వినుకొండ పట్టణంలోని మసీదు మాన్యంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మసీదు మాన్యంలో నివాసం ఉంటున్న శిరిగిరికుమార్ (38) భార్య స్వాతి ఇద్దరు రెండో వివాహం చేసుకున్నారు. తరచూ భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈనేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరు గొడవ పడ్డారు. ఈ క్రమంలో స్వాతి భర్త కుమార్‌ను దిండితో ఊపిరాకుండా చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కుమార్ తల్లి మేరి రోజ్లింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌శాఖలో సాయుధ బలగాల పాత్ర కీలకం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



పోలీసులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

బాపట్ల టౌన్: పోలీస్‌శాఖలో సాయుధ బలగాల పాత్ర కీలకమైందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా సాయుధ పోలీసు బలగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బందికి సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 'మొబలైజేషన్'లో భాగంగా సాయుధ పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కొరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో నిష్ణాతులైన వైద్యబృందంతో 121 మంది సాయుధ పోలీసు సిబ్బందికి షుగర్, బీపీ, గుండె, కంటి సమస్యలకు, దంత సమస్యలకు, ఇతర ఆరోగ్య పరమైన సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని చిదిమేసిన 'తుఫాన్'

చెల్లెలిని ట్యూషన్‌లో దించి వస్తూ దుర్మరణం



వెంకటేశ్వర్లు (ఫైల్)

నరసరావుపేట రూరల్: తుఫాన్ వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ముసలిమడుగు శ్రీనివాసరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీనివాసరావుకు కుమారుడు వెంకటేశ్వర్లు(19) పట్టణంలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, కుమార్తె శ్రీదేవి ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ప్రతిరోజు సమీప గ్రామమైన ములకలూరులో శ్రీదేవి ఉదయాన్నే ట్యూషన్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం 5 గంటలకు తన తండ్రి ఆటోలో చెల్లి, ఆమె స్నేహితురాలిని ములకలూరులో వదిలిపెట్టి గ్రామానికి తిరిగి ప్రయాణమయ్యాడు. గ్రామ సమీపంలోకి ఆటో చేరుకున్న సమయంలో ఎదురుగా వచ్చిన తుఫాన్ వాహనం ఢీ కొట్టింది. తుఫాన్ వాహనం వేగంతో ఢీ కొట్టడంతో ఆటో నడుపుతున్న వెంకటేశ్వర్లు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంలో తుఫాన్ వాహనం పక్కనున్న పంటకాలువలోకి పల్టీకొట్టింది. ఈ వాహనంలో బియ్యపు బస్తాలు ఉన్నాయి. ఇవి రేషన్ బస్తాలుగా గ్రామస్తులు అనుమానిస్తున్నారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ బాలనాగిరెడ్డి తెలిపారు.

సెలవులు క్రెడిట్ రిజిస్టర్‌లో నమోదు చేయిస్తా..

నరసరావుపేట: జిల్లాలో సచివాలయ ఉద్యోగులు అందరికి వారు వాడుకున్న సెలవులను క్రెడిట్ సర్వీస్ రిజిస్టరులో నమోదు చేసేట్లుగా ఉత్తర్వులు ఇస్తానని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి మహాలక్ష్మి హామీ ఇచ్చారు. సోమవారం ఎన్జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రెటరీ కలిసి గ్రామ, వార్డు సచివాలయాల సెక్రెటరీ ఉద్యోగుల సమస్యలను కార్యాలయంలో ఆమెకు వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట యూనిట్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కార్యదర్శి ఎస్.ఆనంద్‌నాథ్ పాల్గొన్నారు.

నా కుమారుడిని హత్యచేసి రైల్వేట్రాక్‌పై పడేశారు

- ప్రమాదవశాత్తూ మృతిగా చిత్రీకరించే ప్రయత్నం
- ముగ్గురు విద్యార్థుల ప్రమేయముందని తండ్రి ఫిర్యాదు
- సబ్‌కలెక్టర్ 'స్పందన'లో అర్జీ అందజేత



సబ్‌కలెక్టర్‌కు కుమారుడి మృతిపై ఫిర్యాదు చేస్తున్న రత్నరాజు

తెనాలి: మంగళగిరి నియోజకవర్గంలోని చిలువూరు గ్రామానికి చెందిన బాలుడి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని అతడి తండ్రి గళ్లె రత్నరాజు తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మకు అర్జీనిచ్చారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన సమావేశంలో మొత్తం ఏడు అర్జీలు రాగా, వాటిలో రత్నరాజు ఇచ్చిన అర్జీ ఒకటి. సబ్‌కలెక్టర్‌కు విన్నవించిన వివరాలు.. పెయింట్ పనికి వెళుతుండే రత్నరాజుకు ఇద్దరు కొడుకులు. రెండో కొడుకు ప్రదీప్(14) రేవేంద్రపాడు జిల్లాపరిషత్ హైస్కూలులో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 8వ తేదీ స్కూలుకు వెళ్లిన ప్రదీప్ ఇంటికి రాలేదు. ఆ రాత్రి గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదు. మరుసటిరోజు దుగ్గిరాల పోలీసులకు ఫిర్యాదు చేసి తెనాలి వెళ్లి, రైల్వేస్టేషనులో విచారించినట్లు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై చనిపోయిన ఉన్న బాలుడి శవాన్ని తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామని రైల్వే పోలీసులు తెలిపారు. వారు సూచించిన ప్రకారం మార్చురీకి వెళ్లి చూడగా, అది తమ కుమారుడు ప్రదీప్ మృతదేహంగా గుర్తించినట్లు రత్నరాజు వివరించారు. మరుసటిరోజు తమకు అప్పగించగా, చిలువూరు తీసుకెళ్లి, అంతిమ సంస్కారాలు చేసినట్లు తెలిపారు. పెదవడ్లపూడికి చెందిన పదో తరగతి విద్యార్థి, అదే గ్రామానికి చెందిన ఇద్దరు తొమ్మిదో తరగతి విద్యార్థులు కలిసి తన కుమారుడు ప్రదీప్‌ను 8వ తేదీన 11.20 గంటల ప్రాంతంలో తీసుకెళ్లినట్లు తెలిసిందన్నారు. ఆ ముగ్గురు కలిసి ప్రదీప్‌ను చంపి విజయవాడ-చెన్నై రైలు మార్గంలో చిలువూరు- మంచికలపూడి మధ్య రైల్వేట్రాక్‌పై పడేసినట్టుగా ఆరోపించారు. తన కుమారుడిని హత్యచేసి సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రైల్వే పోలీసులకు తెలిపినప్పటికీ ఆ దిశగా విచారణ చేయటం లేదని బాధితులమైన తమనే బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరగా, తప్పక పరిశీలిస్తామని సబ్‌కలెక్టర్ హామీనిచ్చారు. దీనితోపాటు సర్వే సర్టిఫికెట్ కోరుతూ ఒకరు, ఆక్రమణ తొలగించాలని అభ్యర్థిస్తూ మరొకరు, రేషను కార్డును విభజించాలంటూ ఇంకొకరు చొప్పున మొత్తం ఏడు అర్జీలు దాఖలయ్యాయి.